క్లుప్తంగా

గుడిబండలో మోస్తరు వర్షం



గుడిబండలో కురుస్తున్న వర్షం

గుడిబండ: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ కింద వేరుశనగ, రాగి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

సోమందేపల్లిలో...

సోమందేపల్లి: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. దాదాపు గంటకుపైగా వర్షం దంచి కొట్టింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లడింది. రోడ్లపై వర్షపు నీళ్లు ప్రవహించాయి.

వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

మడకశిర: పట్టణ శివారులోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. ద్విచక్ర వాహనంలో వెళుతూ అదుపుతప్పడంతో ప్రమాదం జరిగిందా? లేదా ఏదైనా వాహనం ఢీకొందా? అనేది తెలియాల్సి ఉంది. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కూడా ఎవరో తెలీదని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

పారిశుధ్యంపై డీసీహెచ్ఎస్ అసంతృప్తి



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని మంగళవారం డీసీహెచ్ఎస్ తిపేంద్రనాయక్ తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలోని వార్డులు, డయాలసిస్ కేంద్రం, మాతాశిశు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అలాగే ఆస్పత్రి పరిసరాలను కూడా పరిశీలించిన తర్వాత ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్ రోహిల్‌తో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న పీడీ నర్సయ్య

సోమందేపల్లి: పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ నర్సయ్య సూచించారు. మంగళవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో యానిమేటర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థికాభివృద్ధి చెందడానికి తోడ్పాటు అందించాలన్నారు. అదే విధంగా డ్వాక్రా లీడర్లు రుణాలు సక్రమంగా కట్టేల సీసీలు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం రామిరెడ్డి ఏపీ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



హిందూపురం: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



పెనుకొండ: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ శాంతలక్ష్మి



మడకశిర మండలం ఒంటిపాళ్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: తల్లి పాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని సీడీపీఓ రెడ్డి రమణమ్మ అన్నారు. పట్టణంలోని మోడల్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ రెడ్డి రమణమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్లు అంజలిదేవి, మహబూబ్ బీ, సూపర్‌వైజర్లు అనిత, శాంతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీడీపీఓ తల్లిపాల విశిష్టతను వివరించారు.

పరిగి: కలుషితం లేని ఖరీదైన పోషక విలువలు కలిగినవి తల్లి పాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు నవీన, స్వరూపరెడ్డి, రూబీ తెలిపారు. పరిగి మండల కేంద్రంలో మంగళవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. సీహెచ్‌ఓ వన్నప్ప, పీహెచ్ఎన్ వెంకమ్మ పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని హులికుంట పంచాయతీ పరిధిలోని కె.గొల్లహట్టి అంగనవాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ , అంగనవాడీ వర్కర్లు ఆదిలక్ష్మీ, రంగమ్మ, భాగ్యమ్మ, రాజేశ్వరి, శాంతమ్మ, అమ్మాజక్క తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని కల్లూరు, నాగానపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలను నిర్వహించి తల్లి పాల విశిష్టతను తెలియజేశారు. సీడీపీఓ రెడ్డిరమణమ్మ , సర్పంచ్ వసుంధర, సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ లీలావతి తెలిపారు. మంగళవారం ఆమె హరేసముద్రం పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఒంటిపాళ్యం గ్రామంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించం

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



గోరంట్ల: 'తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఇకపై దాడులు చేస్తే సహించబోము. బాధితులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. గోరంట్ల మండలంలోని తాటి మాకులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కరరెడ్డి కుటుంబంపై సోమవారం రాత్రి టీడీపీ నాయకులు చేసిన దాడిని ఆమె ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమన్నారు. ప్రజలు కూటమికి అధికారం ఇచ్చింది ప్రజా సేవ చేయడానికేగాని దాడులు చేయడానికి కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తుండటం హేయమన్నారు. ఇకనైనా తెలుగుదేశం పార్టీ నాయకులు దాడులు ఆపకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందన్నారు.

14న కుంభాభిషేకం



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపికను ఆహ్వానిస్తున్న ఆలయ ఈఓ, సిబ్బంది

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణ స్వామి ఆలయ విమాన గోపుర కలశం జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఈనెల 14న అష్టబంధన, బాలాలయ, మహాకుంభాభిషేకంతో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. మూలవిరాట్ దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు దర్శించుకోవచ్చన్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపికకు ఆలయ ఈఓ, కమిటీ సభ్యులు ఆహ్వానం అందించారు.

రక్తహీనత లేని సమాజ నిర్మాణమే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ నవీన

పరిగి: ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం ముఖ్యమని, రక్తహీనత లేని సమాజాన్ని నిర్మిద్దామని మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల వ్యాప్తంగా ఉన్న ఆశావర్కర్లకు నిమోనియా, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కల్పించారు. రక్తహీనత, యువతులకు, విద్యార్థినులకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించాలన్నారు. ఆప్తమాలిక్ ఆఫీసర్ డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే మూడు మాసాల్లో పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్స అనంతరం ఉచితంగా కళ్ల జోళ్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నవీన, డాక్టర్ స్వరూపరెడ్డి, సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది

- బాధితులతో మాజీ మంత్రి శంకరనారాయణ



టీడీపీ నాయకుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ

హిందూపురం: అధైర్య పడొద్దు... పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మాజీ మంత్రి శంకరనారాయణ అన్నారు. పెనుకొండ నియోజకవర్గం గోరంట్లలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఓబులమ్మ, రామకృష్ణారెడ్డి ,భాస్కర్‌రెడ్డి హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శంకరనారాయణ మంగళవారం బాధితులను పరామర్శించారు. ఐదేళ్లలోపు తమ కుటుంబ సభ్యులందరినీ చంపేస్తామని బెదిరిస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఓబులమ్మ మాజీ మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అలా ఏమీ జరగనివ్వమని పార్టీ అండగా ఉంటుందని శంకరనారాయణ భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. టీడీపీ మూకలు పెట్రేగిపోతూ దాడులు, హత్యలకు కూడా వెనుకాడటం లేదన్నారు. పెనుకొండ నియోజకవర్గం శాంతియుత ప్రదేశమని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అశాంతి సృష్టిస్తే ప్రజలే తిరగబడతారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి అల్లరి మూకల చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న డీవైఈఓ రంగస్వామి

పెనుకొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డీవైఈఓ రంగస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని దర్జీపేట ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. డీవైఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. విద్యార్థులు ఇందుకు ప్రేరణగా నిలవాలన్నారు. మొక్కలు నాటితేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం అవుతుందన్నారు. జేవీవీ నాయకులు హరి, హెడ్మాష్టర్ రఘునాథరావు, వలివుల్లా, మురళీధర్, బాబా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

క్రీడావికాస కేంద్రం పరిశీలన



క్రీడా వికాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో వివిధ శాఖలపై జిల్లా, స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులకు ఆయన సూచనలు చేశారు.

గురుకుల పాఠశాలను తనిఖీ

అమరాపురం: మండలంలోని హులుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

● వేప చెట్టు నుంచి కారుతున్న కల్లు



చిన్నపరెడ్డిపల్లిలో వేప చెట్టు నుంచి కారుతున్న కల్లు

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు పంచాయతీ చిన్నపరెడ్డిపల్లికి చెందిన రైతు తిప్పన్న పొలంలోని వేప చెట్టు నుంచి కల్లు కారుతోంది. దీంతో మంగళవారం ఉదయం నుంచే స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని ఆ దృశ్యాన్ని వీక్షించారు. ఇందులో భాగంగానే మహిళలు వేప చెట్టుకు పూజలు చేశారు.

శిథిలావస్థలో పాత పంచాయతీ భవనం



రొళ్లలో కూలడానికి సిద్ధంగా ఉన్న పాత పంచాయతీ భవనం

రొళ్ల: మండల కేంద్రం గుడిబండ ప్రధాన రోడ్డు మార్గంలోని గ్రంథాలయం ఆవరణ పక్కన ఉన్న పాత పంచాయతీ భవనాన్ని కూల్చడానికి సంబంధితశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని సర్పంచ్ రామలక్ష్మమ్మ కోరారు. ఈ భవనానికి 50 ఏళ్లు నిండాయని, శిథిలావస్థకు చేరుకోవడంతో ఏక్షణంలోనైనా కూలడానికి అవకాశం ఉందన్నారు. ఏ ప్రమాదం జరగక ముందే భవనాన్ని కూల్చడానికి అనుమతి ఇవ్వాలన్నారు. గత రెండు నెలలుగా సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడం లేదన్నారు.

గ్రామాలు దేశప్రగతికి పునాదులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

పావగడ: గ్రామాలు దేశ ప్రగతికి పునాదులు లాంటివని , గ్రామాల్లో కల్పించే మౌలిక సదుపాయాలే దేశాభివృద్ధికి కొలమానం అని మధుగిరి ఏసీ గోటూరి శివప్ప అన్నారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో మంగళవారం నిర్వహించిన గ్రామ పంచాయతీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పీడీఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాంధీజీ కలలు కన్న గ్రామ రాజ్యం నరేగా పథకంతో నెరవేరుతోందన్నారు. గ్రామాల అభివృద్ధికి గ్రాపం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, పీడీఓలు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.

ప్లీనరీ జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: జిల్లాలోని కొత్తచెరువులో 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని స్థానిక బీసీ కళాశాల హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల పోస్టర్లను విడుదల చేశారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యమివ్వండి

మడకశిర: పెనుకొండ నూతన డీఎస్పీ శ్రీనివాసులు మంగళవారం మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అలాగే రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని కూడా తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని కేసుల వివరాలను తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని కోరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కలిశారు. రూరల్ సీఐ రాజ్‌కుమార్, అర్బన్ సీఐ మనోహర్ తదితరులు ఉన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: నియోజకవర్గంలోని రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏఓ నరసింహప్ప ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి రైతులకు అత్యధికంగా బిందు, తుంపర సేద్యం సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బోర్లు, బావులు కలిగిన రైతులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లను అందిస్తామన్నారు. రైతులు 1బీ, చెక్‌బందీ సర్టిఫికెట్, ఆధార్, బ్యాంక్‌పాసు పుస్తకం, బోరుబావి కరెంట్ బిల్లులను అప్‌లోడ్ చేసి దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు.

ఈ-పంట నమోదు చేసుకోండి

అగళి: మండల పరిధిలోని ఆర్‌జీ పల్లి, ఇరిగేపల్లి, హెచ్ డీ హళ్లి రైతు సేవా కేంద్రంలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం అధికారులకు సూచనలు, సలహాలిచ్చారు. పంట వేసిన ప్రతి రైతు పొలంలో పంట నమోదు చేపట్టాలన్నారు. ఆగస్టు నెలలోపు పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.

రైతులకు అవగాహన

మడకశిరరూరల్: మండల పరిధిలోని సిద్ధగిరి, పాపసానిపల్లి గ్రామాల్లోని రైతులకు డ్రిప్, స్ప్రింకర్ల వాడకంపై ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. గతంలో రైతులకు సబ్సిడీతో అందించిన డ్రిప్ పరికరాలను పరిశీలించారు. నీటి సౌకర్యం ఉన్న ప్రతి రైతూ డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా సాగు చేయాలని సూచించారు.

మెనూ సక్రమంగా అమలు చేయండి

అమరాపురం: పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులకు మెనూ ప్రకారం సక్రమంగా వడ్డించాలని పాఠశాల హెచ్ఎం రఘుకు ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక పరిశీలించి అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఏ విధంగా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

విజేతలకు అభినందనలు

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళి స్థాయి గ్రామీణ క్రీడా పోటీలు ఇటీవల జరిగాయి. ఈ పోటీల్లో అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖోలో ప్రథమ స్థానం, వివిధ పరుగు పందాల్లో శివమ్మ, సతీశ్, శాలిని, అనిత లక్ష్మి, పూర్ణిమ ప్రతిభ చూపి తాలూకా స్థాయి పోటీలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించింది.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు



రొళ్ల: అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి



రొద్దం: అలంకరణలో పెద్దాంజనేయస్వామి



తుమ్మల మారెమ్మకు పూజలు చేసిన దృశ్యం

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన ఇతరాత్ర పూజలు చేశారు. అనంతరం భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలతో పాటు గాజులు, వడి బియ్యం కట్టి పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. విశేష పూజ రోజు కావడంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు ఆలయం చుట్టు జ్యోతులతో ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు.

రొద్దం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను తమలపాకులతో అలంకరించి పూజలు చేశారు. రాత్రి 7 గంటల నుంచి అర్చకుడు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ, శ్రీరామ భక్త మండలి సభ్యులు భజనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుడిబండ: పట్టణ సమీపంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో శ్రావణ మాసం మొదటి మంగళవారం కావడంతో వేకువ జామున 5 గంటల నుంచే విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. అనంతరం వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. పలువురు భక్తులు ఆలయ ఆవరణలో వంటకాలు చేసి అన్నదానం చేశారు.